బాబు.. ఏదీ జవాబు?

గ్యాస్ సిలిండర్ల కోసం ఎదురు చూపు



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన అనంతరం మూడు గ్యాస్ సిలిండర్లను ఇస్తామని నాయకులు ప్రకటించారు. అయితే ప్రభుత్వం కొలువుదీరి మూడు నెలలు పూర్తయిన ఈ పథకంపై ఇప్పటి వరకూ విధివిధానాలు ఖరారు చేయలేదు. ఉచిత సిలిండర్ల కోసం ఎదురు చూస్తున్నాం. మా ప్రాంతంలో ఉన్నవారంతా జీడి కార్మికులే. తక్షణమే ఈ పథకాన్ని అమలు చేస్తే ఉపయోగంగా ఉంటుంది.

- వద్ది గురమ్మ, అంబేద్కర్‌నగర్, 19వవార్డు, సూదికొండ, పలాస మున్సిపాలిటీ

తల్లికి వందనం అందజేయాలి



ఎన్నికల వేళ చెప్పిన విధంగా ప్రభుత్వం తల్లికి వందనం అందజేయాలి. మాకు ఇద్దరు పిల్లలు. ఒకరు ప్రభుత్వ పాఠశాలలో, ఇంకొకడు ప్రభుత్వ ఐటీఐలో చదువుతున్నాడు. పాఠశాలలు తెరిచిన వెంటనే గతంలో అమ్మఒడి అందేది. ఈ ఏడాది పాఠశాలలు తెరిచి చాలా రోజులైన నూతన ప్రభుత్వం తల్లికి వందనం నిధులు అందజేయకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం.

- కొల్లి భారతమ్మ, కాపుతెంబూరు, నందిగాం మండలం

ఉచిత బస్సు ప్రయాణం ఎప్పుడో



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అంటూ సూపర్ సిక్స్ పేరుతో మేనిఫేస్టోలో చేర్చారు. ఇప్పటికీ ఆ పథకంపై సరైన వివరణ ఇచ్చే పరిస్థితుల్లో ప్రస్తుత ప్రభుత్వం లేదు. ఇప్పుడేమో సాక్షాత్ ముఖ్యమంత్రి సూపర్ సిక్స్ అంటేనే భయం అంటూ కొత్త నాటకానికి తెరతీస్తున్నారు. పథకాల పేరుతో అధికారంలోకి వచ్చిన కూటమి సూపర్ సిక్స్ పక్కాగా అమలు చేయాలి

- సల్ల సుగుణ దేవరాజు, డీసీఎంఎస్ మాజీ చైర్‌పర్సన్, ఇచ్ఛాపురం



హామీ ఇచ్చారు.. అమలెప్పుడు?

సూపర్ సిక్స్ హామీలన్నీ వెంటనే అమలు చేయాలని ప్రజల డిమాండ్

సూపర్ సిక్స్.. క్రీడా రంగంలో ఈ పదం ఎక్కువగా వినిపిస్తుంది. అయితే తాము అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పేరుతో సంక్షేమ పథకాలు అందజేస్తామని చెప్పిన కూటమి నాయకులు తీరా అధికారం చేపట్టిన తరువాత ప్రజలతో ఆటలాడుకుంటోంది. అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తయిన సూపర్ సిక్స్ కోసం కనీసం ప్రస్తావించకపోవడంపై ప్రజలు విస్తుపోతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా రైతులకు పెట్టుబడి సాయం అందలేదు. ఒక కుటుంబంలో ఎంత మంది పిల్లలు చదివినా అందరికీ తల్లికి వందనం ఇస్తామని చెప్పిన నాయకులు ఈ పథకంపై ఇప్పటికీ స్పష్టత ఇవ్వలేదు. నిరుద్యోగ భృతి ఊసెత్తలేదు. మహిళలకు నెలకు రూ. 1500 సాయం జాడ లేదు. చివరకు మహిళలకు ఉచితం బస్సు ప్రయాణం హామీ గాలిలో కలిసిపోయింది. ఇలా చెప్పుకుంటే పోతే బాబూ ష్యూరిటీ సూపర్ సిక్స్ పథకాలు కాస్త బూటకంగా కనిపిస్తున్నాయంటూ అర్హత కలిగిన లబ్ధిదారులు ఎద్దేవా చేస్తున్నారు. చివరకు విద్యార్థులకు వేయాల్సిన విద్యా దీవెన నిధులు గురించి కనీసం ప్రస్తావన లేదు. దీంతో కళాశాలల యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలని చేస్తున్న ఒత్తిడిని భరించలేక.. ఏం చెప్పాలో తెలియక కన్నీళ్లే విద్యార్థుల సమాధానంగా మిగిలింది. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు ద్వారా అనేక విధాలుగా మేలు చేకూరిందని లబ్ధిదారులు ప్రశంసిస్తున్నారు. ఆ రోజులను గుర్తు చేసుకుంటున్నారు.

- సాక్షి నెట్‌వర్క్

ప్రతి మహిళకూ రూ.1500 ఏదీ..

19 ఏళ్లు దాటిన మహిళలందరికీ నెలకు రూ.1500 ఇస్తాం. వారు ఉచితంగా బస్సుల్లో ప్రయాణించొచ్చు.

మే 5న ఈనాడు పత్రికలో ప్రచురితమైన ఎమ్మెల్యే గౌతు శిరీష హామీలు



నెలకు రూ. 1500 ఎప్పుడు ఇస్తారు?




18 సంతవ్సరాలు నిండిన మహిళలకు నెలకు 15 వందల రూపాయలు ఇస్తామని కూటమి నాయకులు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఇంత వరకు ఈ పథకాన్ని ప్రారంభించలేదు. ఇచ్చిన హామీ ప్రకారం తక్షణమే ఈ పథకాన్ని అమలు చేసి మహిళలకు అండగా నిలవాలి.

- తోట పున్నమ్మ, అంబేద్కర్‌నగర్, 19వార్డు సూదికొండ, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ

అచ్చెన్నా.. 'భృతి' మూడు వేలు ఏదన్నా..!

ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం. ఉద్యోగం వచ్చేంత వరకు యువతకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తాం.

మే 4న ఈనాడు పత్రికలో ప్రచురితమైన మంత్రి, టెక్కలి ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు హామీ..



నిరుద్యోగ భృతి వెంటనే ఇవ్వాలి



నిరుద్యోగ భృతి వెంటనే ఇచ్చి ఎన్నికల్లో ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలి. ఉద్యోగాలు లేక ఎంతో మంది విద్యార్థులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఆశలను అడియాసలు చేయకుండా ఉద్యోగ కల్పన చేయాలి. యువ శక్తిని సద్వినియోగం చేసుకోవాలి. డీఎస్సీ వెంటనే అమలు చేయాలి. చదువుకుంటున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంటుతో పాటు వసతి గృహాలను మెరుగు పరచాలి.

-ఎం.వినోద్‌కుమార్, నిరుద్యోగి, చిన్నగురుదాసుపురం, పలాస మండలం

పెట్టుబడి సాయమేది.. అశోకా..!

సూపర్ సిక్స్ పథకాలు ప్రజల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి దోహదపడతాయి. రైతులకు ఏడాదికి రూ.20 వేలు అందజేయడంతో పెట్టుబడి భారం తగ్గుతుంది.

మే 4న ఈనాడు పత్రికలో ప్రచురితమైన ఎమ్మెల్యే బెందాళం అశోక్ హామీలు



పెట్టుబడి సాయమేదీ?




ఖరీఫ్ సీజన్ దాదాపు చివరి దశకు చేరుకుంటుంది. అయినా ఇప్పటికీ రైతులకు పెట్టుబడి సాయాన్ని కూటమి ప్రభుత్వం అందించలేదు. దీంతో రైతులంతా ఇబ్బందులు పడుతున్నారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం సీజన్ ప్రారంభంలోనే పెట్టుబడి సాయాన్ని అందజేసేది. ఇప్పటికైనా సాయాన్ని అందించి ఆదుకోవాలి.


-బి.ధనుంజయరావు, పోలవరం, టెక్కలి మండలం



మహిళకు నెలకు రూ.1500 సాయం

నియోజకవర్గం	లబ్ధిదారులు	పొందాల్సిన లబ్ధి (సుమారు)
టెక్కలి	85,439	రూ.12.81 కోట్లు
ఇచ్ఛాపురం	1,09,894	రూ.16.48 కోట్లు
పలాస	97,400	రూ.14.61 కోట్లు





అన్నదాతా సుఖీభవా

నియోజకవర్గం	లబ్ధిదారులు	పొందాల్సిన లబ్ధి (సుమారు)
టెక్కలి	51,255	రూ.102.51 కోట్లు
ఇచ్ఛాపురం	36,944	రూ.73.88 కోట్లు
పలాస	37,860	రూ.75.72 కోట్లు





తల్లికి వందనం

నియోజకవర్గం	లబ్ధిదారులు	పొందాల్సిన లబ్ధి
టెక్కలి	47,150	రూ.70.72 కోట్లు
ఇచ్ఛాపురం	54,350	రూ.81.52 కోట్లు
పలాస	38,200	రూ.57.30 కోట్లు




నిరుద్యోగ భృతి

నియోజకవర్గం	లబ్ధిదారులు	పొందాల్సిన లబ్ధి
టెక్కలి	60,253	రూ.18.07 కోట్లు
ఇచ్ఛాపురం	63,712	రూ.19.11 కోట్లు
పలాస	61,412	రూ.18.42 కోట్లు



గ్యాస్ సిలిండర్లు

నియోజకవర్గం	లబ్ధిదారులు
టెక్కలి	85,646
ఇచ్ఛాపురం	1,22,938
పలాస	95,573



మహిళలకు ఉచిత బస్సు

నియోజకవర్గం	లబ్ధిదారులు
టెక్కలి	1,34,595
ఇచ్ఛాపురం	1,58,551
పలాస	96,076

రైతు భరోసా

నియోజకవర్గం	లబ్ధిదారులు	చేకూరిన లబ్ధి
టెక్కలి	44172	రూ.59.62 కోట్లు
ఇచ్ఛాపురం	36,892	రూ.62.71కోట్లు
పలాస	36,165	రూ.48.81 కోట్లు

అమ్మఒడి

నియోజకవర్గం	లబ్ధిదారులు	చేకూరినలబ్ధి
టెక్కలి	28,093	రూ.42.13 కోట్లు
ఇచ్ఛాపురం	30,325	రూ.45.35 కోట్లు
పలాస	26,945	రూ.40.41 కోట్లు

జగన్ ఉంటే అమ్మఒడి వచ్చేది



నా ఇద్దరు పిల్లలు చదవుతున్నారు. అయితే ఫీజులు కట్టడానికి ఇబ్బంది పడుతున్నాను. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉండిఉంటే ఈపాటికి అమ్మఒడి పథకం నిధులు అందేవి. కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పేరుతో రూ. 15 వేలు ఇస్తామని చెప్పినా ఇప్పటి వరకూ దీని గురించి ఎలాంటి సమాచారం లేదు. ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం నిధులను కూటమి ప్రభుత్వం ఇవ్వాలి.

బదకల బాలమ్మ, పద్మనాభపురం, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ

జగన్ చెప్పారు.. చేశారు..

జగన్ పాలనలో సకాలంలో రైతు భరోసా అందేది



ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో సకాలంలో రైతు భరోసా అందేది. కూటమి ప్రభుత్వం ఎన్నికల మునుపు ఇచ్చిన హామీ మేరకు పెట్టుబడి సాయం అందించాల్సి ఉండగా దీనికి గురించి ఇప్పటి వరకూ ఎలాంటి ప్రకటన లేదు. ఉబాలు పూర్తయ్యాయి. ఈ సమయంలో కాకుండా ఇంకెప్పుడు సాయం చేస్తారు. అదే జగన్ పాలనలో సమయానికే మాకు రైతు భరోసా అందేది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పెట్టుబడి సాయం కింద రూ. 20 వేలు అందజేయాలి.

-ఎస్.ఆనంద్, రైతు, బొప్పాయిపురం, టెక్కలి మండలం

జగన్ ఉంటే సకాలంలో అమ్మఒడి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఈ సమయానికి అమ్మఒడి నిధులు అందేవి. దీంతో పిల్లల స్కూల్ ఫీజు చెల్లించుకోవడానికి ఇబ్బంది ఉండేదికాదు. కూటమి ప్రభుత్వం వచ్చి సుమారు రెండు నెలలు కావస్తున్నా తల్లికి వందనం పథకం గురించి ఆలోచన లేదు. ఇంట్లో ఎంత మంది పిల్లలు బడిలో చదివితే అంత మందికి అమ్మకు వందనం పేరుతో ఒకొక్కరికీ రూ.15 వేలు చొప్పున ఇస్తామంటూ సూపర్ సిక్స్‌లో కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రకటించింది. అధికారంలోకి వచ్చాక ఈ పథకాన్ని వచ్చేఏడాదికి ఇస్తామంటూ మంత్రి నారా లోకేశ్ చేసిన వ్యాఖ్యలు ఏరు దాటాక తెప్ప తగలేసేలా ఉన్నాయి.

- దున్న జ్యోతి, విద్యార్థుల తల్లి, ఇచ్ఛాపురం మండలం

పెట్టుబడికి ఇబ్బంది ఉండేదికాదు



వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులకు హాయిగా ఉండేది. ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయానికి పెట్టుబడి ఇబ్బందులు ఉండేవికాదు. ఇచ్చిన మాట ప్రకారం సమయానికి రైతుభరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమయ్యేవి. కూటమి ప్రభుత్వ హయాంలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా ఇప్పటికీ అన్నదాత సుఖీభవ గురించి రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేయడం లేదు. దీంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం. తక్షణమే నిధులు విడుదల చేయాలి.

- దక్కత నూకయ్యరెడ్డి, అధ్యక్షుడు, రైతు సలహా సంఘం, ఇచ్ఛాపురం

అందని వైద్య సేవలు!



టెక్కలి రూరల్: రోగుల్లేక నిర్మానుష్యంగా ఉన్న కె.కొత్తూరు పీహెచ్‌సీ

తమ పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో పని చేస్తున్న డాక్టర్లు విధులు బహిష్కరించారు. మూడు రోజులుగా విధులకు హాజరు కాకపోవడంతో రోగులకు వైద్య సేవలు అందని పరిస్థితి నెలకొంది. పలు పీహెచ్‌సీలను 'సాక్షి' బుధవారం సందర్శించగా.. ఈ విషయం వెలుగుచూసింది. డాక్టర్లు సమ్మెలో ఉండగా కిందిస్థాయి సిబ్బంది విధులకు హాజరువుతున్నారు. అయితే రోగులకు వారి నుంచి సరైన వైద్య సేవలు అందడం లేదు. దీంతో రోగులు కూడా ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లకుండా ప్రైవేటు ఆస్పత్రుల బాటపడుతున్నారు.

రూ. 20 లక్షల ఫర్నీచర్ వితరణ

కాశీబుగ్గ: రామక్రిష్ణాపురంలోని సత్యసాయి మందిరం, విద్యావిహార్, గోశాలకు అవసరమైన ఫర్నిచర్‌ను దాతలు దానం చేశారు. అరబిందో ఫార్మా ఫౌండేషన్ ప్రతినిధులు బుధవారం రూ.20 లక్షల విలువైన టేబుళ్లు, కుర్చీలు, రీడింగ్ టేబుళ్లు అందజేశారు.

పెట్టుబడి సాయం అందజేయాలని వినతి

పలాస: రైతులకు వ్యవసాయ పెట్టుబడి సాయం కింద ఇస్తామన్న రూ. 20 వేలు వెంటనే చెల్లించాలని సీపీఎం అనుబంధ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పలాస తహసీల్దార్ సత్యంకు వినతిపత్రం బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా జీడి రైతాంగ సంఘం జిల్లా కన్వీనరు తెప్పల అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన ఈ హామీని తక్షణమే అమలు చేయాలని కోరారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు పెట్టుబడి సాయం అందించారని గుర్తు చేశారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం కూడా ఇస్తుందని, అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా సహాయం అందజేయాలని విజ్ఞప్తి చేశారు. రైతు సంఘాల నాయకులు ఎంపల్ల కామేశ్వరరావు, కోడ రాజారావు, గార రుద్రయ్య, జుత్తు కిశోర్, జుత్తు నాగేశ్వరరావు, మేడ్ది పాపారావు ఉన్నారు.

వజ్రపుకొత్తూరు: రైతులకు పెట్టుబడి సాయంగా రూ.20 వేలు అందించకుంటే ఆందోళనను ఉద్ధృతం చేస్తామని రైతు, కౌలు రైతు సంఘం నాయకులు టి.భాస్కరరావు, కె.బాలాజీ, బి.రామక్రిష్ణ అన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ పి.బాలకు డిమండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

పలాస: మానసిక ఉల్లాసానికి, దేహదారుద్యానికి క్రీడలు దోహదపడతాయని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్ అన్నారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బొడ్డపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో పలాస నియోజకవర్గస్థాయిలో పాఠశాల విద్యార్థులకు బుధవారం నిర్వహించిన కబడ్డీ, వాలీబాల్ ఎంపిక పోటీలను విఠల్ ప్రారంభించారు. కబడ్డీలో అండర్ 14, అండర్ 17 విభాగంగలో 25 మందిని, వాలీబాల్ పోటీలకు 36 మందిని ఎంపిక చేశారు. బొడ్డపాడు పాఠశాల హెచ్‌ఎం ఎ.వీరరాజు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు పి.తవిటయ్య, పీఈటీలు రామ్‌జీ, పద్మలోచన్, జి.లోకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీలో తలపడుతున్న విద్యార్థులు

సంక్షిప్తంగా...

జీవో నంబర్ 42ను రద్దు చేయాలి

టెక్కలి: జీవో నంబర్ 42ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు నిరసన చేపట్టారు. ఎయిడెడ్ అధ్యాపకులను ప్రభుత్వంలో విలీనం చేసే జీవోను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ అధ్యాపకులు బి.సతీష్‌కుమార్, ఎ.రామారావు, వి.ల్యూక్‌పాల్, డి.వాసుబాబు, పి.వి.ఎస్.ఆచార్యులు, సి.కవిత నినాదాలు చేశారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

ఇచ్ఛాపురం రూరల్: జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందిన ఇన్నేశుపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు బి.శంకరంను సహోపాధ్యాయులు బుధవారం సత్కరించారు.

క్రీడలను ప్రోత్సహించాలి

కంచిలి: విద్యతోపాటు క్రీడలను కూడా ప్రోత్సహించాలని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. మకం సరియాపల్లిలోని ఏపీ మోడల్ స్కూల్ మైదానంలో మండలస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడాకారుల ఎంపికలను బుధవారం నిర్వహించారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

టెక్కలి: విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మకత, మేధస్సును వెలికితీయాలని టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు అన్నారు. కళాశాలలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో లోగో రూపకల్పన పోటీలను బుధవారం నిర్వహించారు.

సీతారాం ఏచూరికి ఘనంగా నివాళి

కంచిలి: బూరగాం గ్రామంలో కామ్రేడ్ సీతారాం ఏచూరి సంతాప సభను సీపీఎం నేత కప్ప గోపీనాథ్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు.

ఉత్సాహంగా మండలస్థాయి క్రీడా జట్ల ఎంపికలు

ఇచ్ఛాపురం: ఎస్‌జీఎఫ్ మండలస్థాయి క్రీడాజట్ల ఎంపిక పోటీలు స్థానిక సురంగిరాజా క్రీడా మైదానంలో జోన్-1 వ్యాయామ ఉపాధ్యాయసంఘం అధ్యక్షులు కె పద్మనాభం రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం జరిగాయి.

కొండ ముచ్చుల బారినుంచి కాపాడాలి

సోంపేట: కొండ ముచ్చుల బారినుంచి గ్రామస్తులను కాపాడలని మాకన్నపురం పంచాయతీ శారదపురం గ్రామస్తులు, బీసీ సంఘం రాష్ట్రకార్యదర్శి బీన డిల్లీరావు కోరారు. గ్రామానికి చెందిన బతకల శాంతమ్మ, కొరికాన చిరంజీవి, కొరికాన రాములమ్మ, పొట్నూరు పుష్ప, పిన్నింటి పాపమ్మ, నక్క గుండమ్మ తదితరులు కొండముచ్చుల దాడిలో గాయపడ్డారన్నారు.

గజలక్ష్మి ఉత్సవాలకు శుభరాట

ఇచ్ఛాపురం: పురపాలకసంఘం పరిధిలోని రత్తకన్న గ్రామంలో గజలక్ష్మి నవరాత్రి ఉత్సవాల నిర్వహణలో భాగంగా శుభరాట కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అక్టోబర్ 17వ తేదీ నుంచి గజలక్ష్మి నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

తూతూ మంత్రంగా విచారణ!

సోంపేట: విద్యార్థుల ఆరోగ్యంతో ప్రభుత్వం చెలగాటం శీర్షికతో 'సాక్షి'లో ఇటీవల కథనం వచ్చింది. దీనిపై జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో విద్యాశాఖాధికారి ఎస్.జోరాడు బుధవారం తూతూ మంత్రంగా విచారణ చేపట్టారు. కుళ్లిపోయిన కోడిగుడ్లను ఇప్పటికే ఎంపీడీవో పరిశీలించి ఉన్నారు. అయితే వాటిని విద్యార్థులకు అందజేయలేదని ప్రధానోపాధ్యాయుడు, వంట నిర్వాహకులు విద్యాశాఖాధికారికి చెప్పడం గమనార్హం.

మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్టు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని మూడు రోడ్ల కూడలి వద్ద మద్యం అమ్మకాలు చేపడుతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు కాశీబుగ్గ పోలీసులు తెలిపారు. స్థానిక 17వవార్డు తిలక్‌నగర్‌కు చెందిన అంబటి ఈశ్వరరావును ఆరు మద్యం బాటిళ్లతో పట్టుకున్నామన్నారు.

ఇరువురిపై కేసు నమోదు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి కేటీరోడ్డుకు సమీపంలో ఇద్దరు వ్యాపారులు బుధవారం కొట్లాడుకున్నారు. జంట పట్టణాలకు చెందిన కొంచాడ భీమారావు, కొంచాడ దవళేశ్వరరావు మధ్య ఆస్తి విషయమై తలెత్తిన వివాదం కొట్లాటకు దారితీసింది. ఇరువురు చేసిన ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

ఉత్సాహంగా ప్రపంచ వెదురు దినోత్సవం

ఇచ్ఛాపురం: ప్రపంచ వెదురు దినోత్సవాన్ని అంతర్ రాష్ట్ర మహేంద్ర మేదరి సంఘం ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని రోటరీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. తొలుత పట్టణంలో గురూజీ భరతానందస్వామితో కలసి ర్యాలీ చేశారు. సమితి రాష్ట్ర కన్వీనర్ డి.ఏసుబాబు, అంతర్ రాష్ట్ర మహేంద్ర మేదరి సంఘం అధ్యక్షులు తెల్లి ధర్మారావు, కార్యదర్శి వెంకటకృష్ణ, పాల్గొన్నారు.

మామిడిపల్లిలో వైద్య శిబిరం

పలాస: మామిడిపల్లిలో వైద్య శిబిరం నిర్వహించారు. రెంటికోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది హాజరై 46 మందికి వైద్య పరీక్షలు చేశారు.